
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 కనిష్ఠం 20.6



కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ బదిలీ

కామారెడ్డి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాత బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సీడీఎంఏ అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మూడు మున్సిపాలిటీల కమిషనర్‌లను బదిలీ చేయగా అందులో కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాత కూడా ఉన్నారు. వరంగల్ జిల్లా పల్వంచ మున్సిపాలిటీకి ఆమెను బదిలీ చేశారు. సోమవారం ఆమె కామారెడ్డి మున్సిపల్ నుంచి రిలీవ్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇంకా ఎవరికి కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు కేటాయించలేదు.

జోరుగా లింగ నిర్ధారణ దందా



అధికారులు గుర్తించిన స్కానింగ్ మిషన్

- తాజాగా లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ యంత్రాలను పట్టుకున్న అధికారులు
- సోనోగ్రఫి స్కానింగ్ యంత్రాన్ని తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- గతంలో ఇదే కేసులో సీజైన ఆసుపత్రిలోనే మరో స్కానింగ్ యంత్రం గుర్తింపు
- స్కానింగ్ యంత్రాలను తరలిస్తూ పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులు
- కేసు నమోదు చేసి కోర్టులో పిటీషన్ దాఖలు చేసిన వైద్య ఆరోగ్యశాఖ
- ఈ దందాను ప్రత్యేక ముఠా నిర్వహిస్తున్నట్లు సమాచారం
- గుట్టుగా మొబైల్ వాహనాల ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు
- కామారెడ్డిలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా విస్తరించిన ముఠా



కారులో తరలిస్తున్న సోనోగ్రఫి యంత్రం

కామారెడ్డి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో లింగ నిర్ధారణ పరీక్షలు ఆగడం లేదు. గర్భంలో ఉన్నది ఆడ, మగ పిండాన్ని ముందుగానే గుర్తించి నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇందుకు కామారెడ్డి అడ్డాగా మారినట్లు తెలుస్తోంది. గతంలో లింగ నిర్ధారణ చేస్తున్న ఓ ఆసుపత్రిని సీజ్ చేయడమే కాకుండా నిర్వాహకులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. అయినప్పటికీ జిల్లాలో ఏదో ఒక చోట పదేపదే లింగ నిర్ధారణ చేసే కేసులు నమోదవుతునే ఉన్నాయి. కేసులకు నిర్వాహకులు భయపడడం లేదని వైద్యఆరోగ్యశాఖ నుంచి కొందరి సహకారం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ యంత్రాలను కారులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అదేవిధంగా గతంలో ఇదే వ్యవహారంలో సీజ్ అయిన ఆసుపత్రిలో మరో స్కానింగ్ యంత్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ గుర్తించి సీజ్ చేశారు. దీనిని బట్టిచూస్తే కామారెడ్డిలో ఒక ముఠాగా ఏర్పడి లింగ నిర్ధారణ దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ముఠాగా ఏర్పడి కేంద్రాల్లోనే కాకుండా మొబైల్ వాహనాల ద్వారా దందాను నడుపుతున్నట్లు సమాచారం. ముఠా సభ్యులు జిల్లాలోనే కాకుండా పొరుగు జిల్లాలు, మహారాష్ట్రకు సైతం వీరి దందా విస్తరించినట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖలు మరింత నిఘా పెట్టినట్లు సమాచారం.

తాజాగా పట్టుబడ్డ రెండు స్కానింగ్ మిషన్‌లు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి సోనోగ్రఫి స్కానింగ్ యంత్రాన్ని ఇద్దరు వ్యక్తులు కారులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి చంద్రశేఖర్‌కు సమాచారం అందించడంతో ఆయన సిబ్బందితో కలిసి వచ్చి కారులో ఉన్న స్కానింగ్ యంత్రాన్ని ఆర్డీవో రంగనాథం సమక్షంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి పంచనామా చేసి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అక్కడి నుంచి గతంలో సీజ్ చేసిన ఆసుపత్రిలో ఉన్న స్కానింగ్ మిషన్ అయింటుందని అనుమానించి ఆ ఆసుపత్రికి వచ్చి పరిశీలించగా అక్కడ మరో స్కానింగ్ యంత్రాన్ని గుర్తించారు. దీంతో ఆ రెండు స్కానింగ్ మిషన్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

కోర్టులో పిటీషన్ వేసిన వైద్య ఆరోగ్యశాఖ

కామారెడ్డి పట్టణ కేంద్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఓ రెండు ఆసుపత్రులను గతంలో సీజ్ చేయడం, నిర్వాహకులపై కేసు నమోదు చేసి జైలుకు పంపడంతో వారు బెయిల్‌పై తిరిగి వచ్చి కోర్టు ద్వారా స్టే తెచ్చుకున్నారు. సదరు నిర్వాహకులపై కేసులు నమోదవుతున్నా భయపడడం లేదు. తాజాగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ యంత్రాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. వారిపై గతంలో ఇదే వ్యవహారంలో కేసులు నమోదయ్యాయి. అయితే ఈ సారి వైద్య ఆరోగ్యశాఖ పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై ప్రాథమిక సమాచారంతో వైద్యఆరోగ్యశాఖ కోర్టులో పిటీషన్ వేసింది. దీనిపై తగిన ఆధారాలతో కోర్టులో నివేదికలను సమర్పించేందుకు వైద్యఆరోగ్యశాఖ సిద్ధమవుతోంది.

మొబైల్ వాహనాల ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు నిర్వాహకులు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రుల్లో స్కానింగ్ చేస్తే ఎక్కడ పట్టుబడుతామోనని మొబైల్ వాహనాల ద్వారా స్కానింగ్ యంత్రాలను తరలిస్తూ ఇంటికి వెళ్లి పరీక్షలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. శుక్రవారం రాత్రి లింగ నిర్ధారణ పరీక్షలు చేసే యంత్రాన్ని పోలీసులు ఓ కారులో గుర్తించారు. సదరు వ్యక్తులు కారులో స్కానింగ్ యంత్రాన్ని ఇంటికి తీసుకెళ్లి గుట్టుగా పరీక్షలు నిర్వహించి తిరిగి వస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు తెలుస్తోంది. పిండం ఆడ, మగ బిడ్డ అని తెలుసుకోవాలని ఆత్రుత ఉండేవారు సదరు వ్యక్తులకు ఫోన్ చేసి పరీక్షల కోసం ఇంటికే పిలిపించుకుంటున్నట్లు సమాచారం. స్కానింగ్ చేసే ఎలాంటి అర్హతలు లేకున్నప్పటికీ కేవలం స్కానింగ్ యంత్రాలు ఉంటే చాలు మొబైల్ వాహనంలో ఇంటికే తీసుకెళ్లి పరీక్షలు చేస్తున్నారు. దీనికి నిదర్శనం ఇటీవల రాజంపేటలో పట్టుబడిన వ్యక్తి జిల్లాలోని ఆయా గ్రామాల్లో మొబైల్ వాహనం ద్వారా స్కానింగ్ యంత్రాలను తీసుకెళ్లి గర్భిణులకు పరీక్షలు చేసినట్లు తెలుస్తోంది. కామారెడ్డి, దోమకొండ, బీబీపేట, సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి తదితర మండలాల్లో తన వాహనంపై మినీ స్కానింగ్ యంత్రాన్ని తీసుకెళ్లి గర్భిణీ ఇంటి వద్దనే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

ముఠాగా ఏర్పడి

జిల్లాలో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయడానికి ఓ ముఠానే ఏర్పడినట్లు తెలుస్తోంది. గత పక్షం రోజుల కిందట రాజంపేటలోనూ ఓ ఇంట్లో గుట్టుగా స్కానింగ్ యంత్రాల ద్వారా గర్భవతులకు లింగ నిర్ధారణ చేస్తున్న నిర్వాహకుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సదరు నిర్వాహకుడితో ఎం టం వ ంరో వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు యంత్రాన్ని సీజ్ చేశారు. ఈ వ్యక్తి గతంలో ఓ ఆసుపత్రిలో స్కానింగ్ ఆపరేటింగ్ చేశాడు. ఆ ఆసుపత్రి సైతం లింగ నిర్ధారణ కేసులోనే వైద్యులు సీజ్ చేశారు. తాజాగా స్కానింగ్ యంత్రాలను కారులో తరలిస్తున్న వ్యక్తి సైతం సీజ్ అయిన ఆసుపత్రి నిర్వహించాడు. సీజ్ అయిన ఆసుపత్రి సమీపంలోనే మరో ఆసుపత్రి

(మిగతా 8వ పేజీలో)

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి!





శ్రీహరి రాజు,
మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్

ఇంటర్వ్యూ

బాన్సువాడ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరిరాజు 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రతీరోజు సర్వే చేపడుతున్నామన్నారు. ఇంటి పన్ను వసూళ్ల కోసం నవంబరు నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు వివరించారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

ఆంధ్రజ్యోతి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఎన్ని వార్డులున్నాయి? ఎంత మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు?

అధికారి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19 వార్డులున్నాయి. ప్రస్తుతం 90 మంది వరకు కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: బాన్సువాడ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ప్రతీ రోజు పారిశుధ్య నిర్వహణ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. రోడ్లు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. అవసరమైప్పుడు బయట నుంచి తాత్కాలికంగా సిబ్బందిని నియమించుకుని పని చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఎన్ని వచ్చాయి? ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 900 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. ప్రతీ రోజు 30 నుంచి 40 దరఖాస్తులను సర్వే చేయిస్తున్నాం. ఆయా శాఖల అధికారులతో చర్చించి ఎన్ని బఫర్ జోన్‌లో ఉన్నాయోనని పరిశీలిస్తున్నాం. బఫర్ జోన్‌లో ఉన్న వాటిని తిరస్కరిస్తాం.

ఆంధ్రజ్యోతి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు ఏమైనా వచ్చాయా? అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు అందలేదు. ఒకవేళ ఫిర్యాదులు అందితే టీంతో కలిసి అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఇంటి పన్నుల వసూళ్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. 8,835 గృహాలు, ఇల్లు, దుకాణాలు కలిపి 244, దుకాణాలు 953 వరకు ఉన్నాయి. అన్నింటికీ కలిపి 3 కోట్ల 13 లక్షల పన్ను వసూలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. అందులో 1 కోటి 36 లక్షల వరకు వసూళ్లు చేయడంతో 35 శాతం చేశాం. ఇంకా 1 కోటి 76 లక్షలు వసూళ్లు చేయాల్సి ఉంది. రాబోయే నెలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్ష్యాన్ని చేరుకుంటాం.

ఆంధ్రజ్యోతి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది? వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉన్నది. వాటి నియంత్రణ కోసం అధికారులతో చర్చలు జరిపి త్వరలోనే చర్యలు తీసుకుంటాం.



నిజాంసాగర్ ప్రాజెక్టుపై టూరిజం అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నిజాంసాగర్ ప్రాజెక్టును టూరిజం కేంద్రంగా ఏర్పాటు చేస్తాం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టుపై ప్రాచీన కట్టడాలతో పాటు వివిధ గార్డెన్‌లను టూరిజం కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శనివారం నిజాంసాగర్ ప్రాజెక్టును జిల్లా టూరిజం శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లతో కలిసి ఆయన గోల్‌బంగ్లా తదితర ప్రాచీన కట్టడాలను పరిశీలించారు. నిజాంసాగర్ గోల్‌బంగ్లా పరిసర ప్రాంతంలో సర్వే నెంబర్ 121 నెంబర్లు భూమిని టూరిజంకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ భిక్షపతిని ఆదేశించారు. ఆనాడు నైజాం నవాబులు నిర్మాణం చేపట్టిన నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎంతో చరిత్ర ఉందని ఆయన గుర్తు చేశారు. నిజాంసాగర్ పరిసర ప్రాంతాల్లో టూరిజం లేక పర్యాటకులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన విషయం విధితమే. నిజాంసాగర్ ప్రాజెక్టును టూరిజంగా తీర్చిదిద్దడమే కాకుండా పర్యాటకులకు కనీస సౌకర్యాలు ఏర్పాటుతో పాటు బోటు సౌకర్యం కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నిజాంసాగర్ రహదారులను ప్రాచీన కట్టడాలను పర్యాటకులకు కనువిందు చేసేందుకు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా టూరిజం అధికార యంత్రాంగంతో పాటు తహసీల్దార్ భిక్షపతి, ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తదిత రులు ఉన్నారు.

మద్నూర్‌లో కార్యాలయాల పరిశీలన

మద్నూర్: మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను శనివారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ముందుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెళ్లి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల వివరాలను ఎంపీవో వెంకట నర్సయ్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల కార్యాలయంలోకి వెళ్లి ఉపాధ్యాయులు హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వైద్య విధాన పరిషత్ 30 పడకల ఆసుపత్రిని పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలను, వారికి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ జాదవ్‌ను ఆసుపత్రిలో ఉన్న సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి దస్త్రాలు నిల్వ చేసిన గదిని పరిశీలించారు.

ఐటీఐ సీట్ల భర్తీని అన్ని శాఖల సహకారంతో నిర్వహించాలి

బిచ్కుంద: ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ బిచ్కుందలో ఈ సంవత్సరం నుంచి కొత్తగా ప్రారంభిస్తున్న ఆరు ట్రేడ్‌లలో అడ్మిషన్‌ల భర్తీ అన్ని శాఖల సహకారంతో నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం బిచ్కుంద మండలంలోని ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న అడ్మిషన్ల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిచ్కుంద చుట్టు పక్కల మండలాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, అన్ని గ్రూప్‌లో అడ్మిషన్ ప్రక్రియపై ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈనెల 30 వరకు అడ్మిషన్స్ జరుగుతున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు

- నియోజకవర్గ పరిధిలో గ్రామీణ రోడ్లకు నిధుల కేటాయింపు
- మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే కాటిపల్లి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.5 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ అయింది. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులను కేటాయించనున్నారు. కామారెడ్డి మండలంలోని అడ్లూర్ నుంచి బతుకమ్మ కుంట వరకు కిలో మీటరు బీటీ రోడ్డుకు రూ.1కోటి, పల్వంచ మండలంలోని ఎల్పుగొండ, పరిదిపేట వయా బచ్చువాని కుంట వరకు అర కిలో మీటర్ రోడ్డుకు రూ.50లక్షలు, మాచారెడ్డి మండలంలోని మాచారెడ్డి నుంచి అక్కాపూర్ కిలో మీటర్ వరకు రూ.1 కోటితో, దోమకొండ మండలంలోని సంగమేశ్వర్ నుంచి సీతారాంపల్లి వరకు రెండు కిలో మీటర్ల వరకు రూ.2 కోట్లు, రాజంపేట మండలంలోని శివాయిపల్లి నుంచి తలమడ్ల 60 మీటర్లలో రూ.50లక్షలతో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. నియోజకవర్గ పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయడంపై రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కకు స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గతంలో నియోజకవర్గంలో పంచాయతీ రాజ్‌శాఖ తరపున అభివృద్ధి పనులకు రూ.15కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపగా రూ.5 కోట్లు మంజూరు చేసిందన్నారు. మరో రూ.20 కోట్ల పనులకు త్వరలోనే మంజూరు చేస్తామని మంత్రి మాట ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

7

- అడ్రస్ లేని స్పెషల్ ఆఫీసర్లు
- పారిశుధ్యం అస్తవ్యస్తం
- వ్యాధులు వ్యాపిస్తున్నా చర్యలు శూన్యం

పల్లెలపై పట్టింపేదీ!?



పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువు



- నిరుపయోగంగా నీటి ట్యాంకర్లు
- కోతుల ఆహారశాలలు కనుమరుగు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు

7

అంతర్జాతీయ ఉషు పోటీలకు

జిల్లా క్రీడాకారుడు సాయిదీక్షిత్


సాయిదీక్షిత్‌ను సన్మానిస్తున్న సీఐ

సుభాష్‌నగర్,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉషు పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు సాయిదీక్షిత్ ఎంపికయ్యాడు. అండర్-12 విభాగంలో ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు యూరప్ దేశంలోని జార్జియా రాష్ట్రంలో నవంబర్ 12 నుంచి 17 వరకు జరుగనున్నాయి. ఈ పోటీల్లో సాయిదీక్షిత్ తన ప్రతిభను చాటనున్నాడు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన సాయిదీక్షిత్‌ను నగర సీఐ శ్రీనివాసరాజు అభినందించారు. నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లాకు చెందిన క్రీడాభిమానులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

దక్షిణ ప్రాంత అంతర విశ్వవిద్యాలయం

పోటీల కోసం విద్యార్థి ఎంపిక

ధర్పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ ప్రాంత అంతర విశ్వవిద్యాలయం పోటీల కోసం ధర్పల్లి డిగ్రీ కళాశాలకు చెందిన సాయికుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీసీఎస్‌కు చెందిన సాయికుమార్ అక్టోబర్ 29 నుంచి నవంబర్ 4 వరకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెన్నైలో జరిగే కబడ్డీ టోర్నమెంట్‌కు దక్షిణ ప్రాంత అంతర విశ్వవిద్యాలయం పోటీకి ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ నుంచి సాయికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను ప్రిన్సిపాల్ జ్యోతి, క్రీడల ఇంచార్జి కుమారస్వామి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాం, ప్రభాకర్, రవిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ కాయిల్స్ చోరీ

నవీపేట,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని భరత్ నగర్ తండా, మట్టయ్య ఫారం శివారులలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల కాపర్ కాయిల్స్ గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని ఎస్ఐ వినయ్ తెలిపారు. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ల కాపర్ కాయిల్స్‌ను దుండగులు చోరీ చేశారని లైన్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

ఎడపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన మహిళ శనివారం ఎడపల్లి గ్రామంలోని పెద్ద చెరువులో పడి మరణించిందని ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి గ్రామానికి చెందిన అంబటి నాగమణి (56) శుక్రవారం సాయంత్రం కాలకృత్యాలకని ఇంట్లో నుండి వెళ్లి ఎంతకీ తిరిగి రాకపోయే సరికి చుట్టుపక్కల వెతికినా కనిపించలేదని, శనివారం ఉదయం పెద్ద చెరువులో శవంగా కనిపించిందని ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించిందని మృతురాలి కుమారుడు నాగరాజు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలు మృతి..

మాక్లూర్ :మండలంలోని కల్లెడ గ్రామానికి మోతె గంగుబాయి (90) అనే వృద్ధురాలు శుక్రవారం సాయంత్రం గ్రామశివారులోని చెరువులో బహిర్భూమికి వెళ్ళి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం విషయం పోలీసులకు మృతురాలి బోజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్సైగంగాధర్ తెలిపారు.

రాకాసిపేట్‌లో ఒకరిపై కేసు నమోదు

బోధన్‌రూరల్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో శుక్రవారం రాత్రి రాకాసిపేట్ ఫంక్షన్ హాల్‌లో అనుమతి లేకుండా అక్కడ ఫొటోలు చేయడమే కాకుండా అక్కడికి విధులపై వెళ్లిన పోలీసులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అటంకం కలిగించినందుకు సాయికుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

ఖోఖో క్రీడాకారులకు క్రీడా దుస్తుల వితరణ

సుభాష్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. నందిపేట మండలం రాజ్‌నగర్ బాయ్స్ యూత్ సభ్యులు బాలబాలికల క్రీడా జట్లకు క్రీడా దుస్తులను అందజేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు క్రీడా పోటీలలో ప్రతిభకనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూమారెడ్డి, అతీఖ్ ఉల్లాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతా కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి) గత కొన్ని సంవత్సరాలుగా వివిధ కేసుల్లో రవాణా శాఖ అధికారులు సీజ్ చేసిన వాహనాలను ఈనెల 29న వేలం వేయనున్నట్లు ఆర్మూర్ ఎంవీఐ గుర్రం వివేకానందరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో ఆటోలు, మినిగూడ్స్ వాహనాలు, బొలెరోలు, స్కూల్ బస్సులు, మోటర్ సైకిళ్లు, రోడ్డు రోలర్, తదితర వాహనాలు ఉన్నాయన్నారు. సీజ్ చేసిన వాహనాలను ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో, నందిపేట, మోర్తాడ్, ముప్కాల్, బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఉంచామన్నారు. వాహనాలు ఉన్నది ఉన్నట్లుగా వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు వాహనాలను పరిశీలించి, దరవతు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఎంవీఐ వివేకానంద రెడ్డి అన్నారు. వేలంపాటు 29న ఆర్మూర్‌లోని వాహన తనిఖీ అధికారి కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

ఖిల్లా, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించిన ఒకటో టౌన్ పోలీసులు బాధితులకు శనివారం అప్పగించారు. వీటి విలువ సుమారు 2లక్షలు ఉంటుందని ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. పోలీసు శాఖ అమలు చేస్తున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వీటిని గుర్తించిన పోలీసులు బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో రఘుపతి మాట్లాడుతూ ప్రజలు రద్దీ ప్రాంతాల్లో దుండగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అనుమానం వచ్చినచో వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

35 చెరువులకు చేపపిల్లల పంపిణీ

ధర్పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 35 చెరువులకు శనివారం చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మత్స్య అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీతో రూ.5లక్షల 39వేల 535 చేపపిల్లలను మండల అభివృద్ధి అధికారి బాలకృష్ణ, మత్స్యశాఖ అధికారులు గంగపుత్రులకు అందజేసి ఎంపికైన చెరువుల్లో వదిలినట్లు ఆయన చెప్పారు. వీటిని మత్స్యకారుల ఉపాధి కోసం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, ధర్పల్లి సింగిల్ విండో ఛైర్మన్ మల్లికార్జున్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, బొక్కల బాలయ్య, సురేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పడకల్ విద్యార్థుల

జక్రాన్‌పల్లి, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలకు పడకల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ శనివారం తెలిపారు. పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతికి చెందిన శ్వేత, ఇంటర్ మొదటి విద్యార్థి కైలాస్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామ గుండంలో ఈనెల 28వ నుంచి 30వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు శ్వేత, కైలాస్‌ను ప్రధానోపాధ్యాయుడు సురేంధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముప్కాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలకేంద్రానికి చెందిన పంచాయతీ కార్మికుడు భోజన్న మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శనివారం ముప్కాల్‌లోని బాధిత కుటుంబాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మున్సిపల్‌కు ఆనుకొని నిర్మిస్తున్న కాంప్లెక్స్

● ఇంటి అనుమతితో కమర్షియల్ కాంప్లెక్స్ ● ఆర్మూర్‌లో కళ్లు మూసుకున్న మున్సిపల్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఫోకస్


మున్సిపల్ కార్యాలయం పక్కనే నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ ఇదే..

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఓకమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోంది. మున్సిపల్ కార్యాలయంకు అనుకొని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గత రెండు నెలల కిందట కమర్షియల్ నిర్మాణం చేపట్టగా ఆ కాంప్లెక్స్‌కు ఇంటి అనుమతి తీసుకొని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు అమ్యామ్యాలకు ఆశపడి నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌కు పడమర దిశలో నిర్మాణం చేస్తున్నా కాంప్లెక్స్‌ను అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాబోవు కాలంలో మున్సిపల్ నూతన భవనం నిర్మాణం చేపడితే మున్సిపల్ అధికారులే సెట్‌బ్యాక్ తీసుకొని నిర్మించాలని కాంప్లెక్స్ యజమాని బహిరంగంగానే చర్చించినట్లు తెలిసింది. కళ్లు మూసుకున్న అధికారులు మున్సిపల్ పక్కన నిర్మిస్తున్న కాంప్లెక్స్‌ను పరిశీలించకపోతే పట్టణంలో, విలీనగ్రామాల పరిధిలో జరుగుతున్న అక్రమ కట్టడాలను ఎలా నిలువరిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు వస్తే తప్ప తూతూ మంత్రంగా జరిమానాలు విధిస్తున్నారు. కానీ చర్యలు చేపట్టకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా కళ్లు తెరిచి మున్సిపల్ అధికారులు సరైన రీతిలో పని చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలతో నిర్మాణాలు చేపట్టాలి



పట్టణంలో నిర్మిస్తున్న భవంతులకు నిబంధ నలతో నిర్మాణం చేపట్టాలి. పట్టణంలో నిర్మాణం జరిగిన పెద్ద భవంతులకు పార్కింగ్ స్థలం లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా అధికారులు ఆమ్యామ్యాలకు ఆశ పడి చూసిచూడనట్లు వ్యవహరిస్తే రాబోవు కాలానికి మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు నిజాయితీతో నిక్కచ్చిగా వ్యవహ రించాలని ప్రజలు కోరుతున్నారు.

- ద్యాగ ఉదయ్, మాజీకౌన్సిలర్

కోటగిరిలో బంద్ విజయవంతం


కోటగిరిలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

కోటగిరి,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందు ఐక్యవేదిక ఇచ్చిన బంద్ పిలుపు శనివారం కోటగిరి మండల కేంద్రంలో విజయవంతమైంది. మండల కేంద్రంలో హిందు ఐక్యవేదిక ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. చావిడి నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. కోటగిరి, రుద్రూరు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా హిందు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆలయాలపై దాడులు, హిందు దేవత మూర్తుల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందు సంఘాల నాయకులు నవీన్, శ్రీనివాస్, శ్యామ్, డాన్ రాజ్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్‌కు అహల్యబాయి ఓల్‌కార్‌గా నామకరణం


పుష్కర ఘాట్ వద్ద అహల్యబాయి చిత్రపటం వద్ద నామకరణ చేస్తున్న దృశ్యం

రెంజల్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సామరసత వేదిక ఆధ్వర్యంలో రాణి అహల్యబాయి ఓల్‌కార్ 300శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం కందకుర్తి పుష్కరఘాట్‌కు అహల్యబాయి ఓల్‌కార్‌గా నామకరణం చేశారు. 250సంవత్సరాల క్రితం అహల్యబాయి ఓల్‌కార్ కట్టించిన శివాలయం దగ్గర కందకుర్తి ఘాట్‌కు నామకరణం చేయడం పూర్వజన్మ సుకృతమని తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ, కార్యదర్శి కొత్త సృజన్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించే ధర్మచార్యుల సమ్మేళనం కార్యక్రమానికి రాష్ట్రంలో ఉన్న సాధుసంతులు వస్తున్నారని దేశంలోని అంటరానితనం, కుల నిర్మూలన కోసం సంకల్పం తీసుకుని ఆశ్రమాల ద్వారా పని చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి హిందువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గజానంద్, విజయ గణపతి, బాల శేఖర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ చేప పిల్లల పంపిణీలో కోతలు విధించొద్దు

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


చేప పిల్లలను వదులుతున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వృత్తి చేసుకొని జీవనం సాగిస్తున్న గంగపుత్రులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ చేప పిల్లల్లో కోతపెడితే ఊరుకునేది లేదని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం బాల్కొండ మండలంలోని నాగాపూర్ బ్యాక్‌వాటర్ ఎస్సారెస్పీలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చేప పిల్ల లను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసీ ఆర్ గంగపుత్రులకు చేపలు, రొయ్యలను బాల్కొండ నియోజక వర్గంలోని 262 చెరువులు, ఎస్ఆర్ఎస్పీ రిజర్వాయర్‌లో వేయానికి గంగపుత్రులకు 72లక్షల చేపపిల్లలు, 69లక్షల రొయ్యపిల్లలు ప్రతి సంవత్సరం పంపిణీ చేశామని ఈ ప్రభుత్వంలో కేవలం 87లక్షల చేపపిల్లలను మాత్రమే పంపిణీ చేస్తుందని అన్నారు. మా ప్రభుత్వ హయంలో పంపిణీ చేసిన చేప పిల్లల కంటే తక్కువ పంపిణీ చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమే శ్వర్, మండల సీనియర్ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, బాల్కొండ సొసైటీ ఛైర్మన్ సురాజ్, మత్స్యశాఖ జిల్లా అధికారి ఆంజనేయులు, తహసీల్దార్ శ్రీధర్, ఏవో లావణ్య పాల్గొన్నారు.

వ్యవసాయగోదాంల పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, కోనాసముందర్ గ్రామాలలోని సహకార సంఘాల ఎరువుల గోదాంలను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రెండు గోదాంల నిర్మాణ పనులకు 25లక్షల చొప్పున నిదులు మంజూరికాగా శంకుస్తానలు జరిగాయి. కాని ప్రభుత్వం మారడంతో నిదులు రద్దయ్యాయని ఎమ్మెల్యే మాట్లాడుతు ఎమ్మెల్యేగా తనకు నిధులు లేనిసమయంలో రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్‌ను కోరగా తన వంతుగా రెండు గోదాంల నిర్మాణాల కోసం 10 లక్షల చొప్పున నిదులు ఇచ్చారని ఈ సందర్భంగా రెండు గ్రామాల సహకారసంఘాల పాలకవర్గసభ్యులు, రైతుల పక్షాన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తోబాటు డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య పాల్గొన్నారు.

బోధన్‌లో గూడ్స్ రైలుకు సాంకేతిక లోపం

● రైల్వేగేటుకు ఇరువైపులా భారీ వాహనాలతో ట్రాఫిక్ జామ్
● సోషల్ మీడియాలో వచ్చిన పుకార్లను నమ్మొద్దన్న స్టేషన్ మేనేజర్

బోధన్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రైల్వే గేటు వద్ద శనివారం గూడ్స్ రైలులో సాంకేతిక లోపం తలెత్తింది. సుమారు గంట పాటు రైలు అలాగే నిలిచిపోయింది. దీంతో రైల్వే గేటుకు ఇరువైపులా భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోవడంతో.. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే సిబ్బంది సుమారు గంట పాటు శ్రమించి.. గూడ్స్ రైలును బాగు చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు.. ఇదే సమయంలో గూడ్స్ రైలు, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లు ఎదురెదురుగా వచ్చాయని కొందరు సోషల్ మీడియాలో పుకార్లు లేపారు. దీంతో ఏం జరిగిందోనన్న గందరగోళం అంతటా నెలకొంది. ఈ విషయమై స్పందించిన బోధన్ రైల్వే స్టేషన్ మేనేజర్ దీయావత్ రాము.. సోషల్ మీడియాలో వచ్చిన పుకార్లను ఎవరూ నమ్మొదన్నారు. బోధన్‌లో రెండు రెళ్లు ఎదురుదెరుగా రాలేదని చెప్పారు. గూడ్స్ రైలు సాంకేతిక లోపాల వల్ల ఆగిపోయిందన్నారు. దీని వల్ల శనివారం బోధన్‌కు రావాల్సిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ నిజామాబాద్‌లోనే ఆగిపోయిందన్నారు.

కారు ఢీకొని చిట్టాపూర్ వాసి మృతి

ముప్కాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ జాతీయరహదారిపై శనివారం రాత్రి కారు ఢీకొని మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన సాయం రాజానందం (55) అక్కడికక్కడే మృతి చెందినట్లు బాల్కొండ ఎస్సై నరేష్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్టాపూర్ నుంచి రాజానందం తన రెండో భార్య సిద్దవ్వను తన బైక్‌పై తీసుకొని బాల్కొండ వైపు వస్తుండగా ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలతో రాజానందం అక్కడికక్కడే మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మాక్లూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంచంద్రపల్లి గ్రామశివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సయ్యద్ మౌలాన ఆసుపత్రిలో శనివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన సయ్యద్ ఫీరోజ్‌తో కామారెడ్డి నుంచి మోటర్ బైక్‌పై వస్తుండగా రాంచంద్రపల్లి గ్రామశివారులో ఫీరోజ్ మోటర్ సైకిల్ అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో బైక్ స్కిడ్ అయి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో మౌలానకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

విధులు సక్రమంగా నిర్వర్తించని

అధికారులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు

● డీఆర్డీవో పీడీ సురేందర్ హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సురేందర్

రామారెడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విధులు సక్రమంగా నిర్వర్తించని అధికారులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లపై కేసులు నమోదు చేస్తామని కామారెడ్డి జిల్లా డీఆర్‌డీవో పీడీ సురేందర్ హెచ్చరించారు. రామారెడ్డి మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం మూడో విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పీడీ సురేందర్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉపాధి పథకంలో అవకతవకలపై ఆరా తీశారు. రామారెడ్డి మండలంలో 19 గ్రామ పంచాయతీల పరిధిలో ఇటీవల నిర్వహించిన ఉపాధిహామీ పనులపై ఆరా తీశారు. ఒక్కొక్కరికి ఉపాధి పనుల్లో డబ్బులు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారు? పని చేయని వారికి డబ్బులు ఇవ్వడం? వసతులను ప్రభుత్వం మంజూరు చేసిన సామాగ్రిని కూలీలకు పంపిణీ చేశారా? అనే విధంగా ఆరా తీశారు. గత సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరంలో ఎన్ని తప్పులు జరిగాయని గ్రామాల వారీగా ఉపాధి సిబ్బందితో పంచాయతీ కార్యదర్శులతో ఆరా తీశారు. ఇటీవల ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని ఐకేపీ సంఘం లీడర్లకు తెలియకుండానే ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టానుసారంగా పనిని బట్టి కాకుండా ఎక్కువ డబ్బులు ఇవ్వడం చేయడం ఎంత వరకు సమంజసం అని పూర్తి నివేదికలు సేకరించారు. అక్రమాలకు పాల్పడి ప్రభుత్వం నివేదికల ను సక్రమంగా పాటించని వారిపై త్వరలో సర్వే నిర్వహించి పూర్తి నివేదికలు సేకరించి నిందితులపై చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని, డబ్బులను చెల్లించుకుంటామని హెచ్చరించారు. త్వరలో ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వివిధ పంటలకు సంబంధించిన రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి, అధికారులు శ్రీనివాస్‌రావు, రాఘవన్, విప్లవకుమార్, ఏపీవో ధర్మారెడ్డి, గత ఇంచార్జి ఎంపీడీవో సవిత, ఉపాధి మండల స్థాయి అధికారులు మారుతి, కవిత, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సయ్య, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కులను లబ్దిదారులకు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన ఈదుల్లా వంశీ, నేముల రాజు, సురిసీడ బాజన్నలకు సంబంధించి రూ.55వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్‌ఖేత్ జిల్లా వైస్‌ప్రెసిడెంట్ టక్కరి గంగాధర్‌లు అందజేశారు. తమ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొల్ల లింగేశ్వర్, గట్టవుతాల నర్సారెడ్డి, గడ్డనర్సయ్య, రాజేందర్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న ఏఐపీకేఎస్, ఏఐపీకేఎంఎస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.దేవరాం, జిల్లా అధ్యక్షుడు ఎస్.సురేష్‌లు అన్నారు. శనివారం కుమార్‌నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ వాగ్దానాల వర్షాన్ని కురిపించిందని, ఇప్పటి వరకు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. అన్ని పంటలకు రూ.500బోనస్ ఇస్తామని చెప్పి రైతు భరోసాకు రెండు పంటలకు రూ.15వేలు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు నెలకు వెయ్యి ఇస్తానని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఈనెల 29న వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కిషన్, కె.రాజేశ్వర్, భాజన్న, అశోక్, బాలయ్య, రాజన్న, లింబాద్రి, గంగాధర్, కె.కిషన్, యు.రాజన్న పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ సందర్శన


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్

ఎడపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించి, ప్రభుత్వ భూముల వివరాలను ఆరా తీశారు. ధరణి ద్వారా చేపడుతున్న రిజిస్ట్రేషన్ వివరాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎడపల్లి ఉప తహసీల్దార్ అనూష తదితరులు ఉన్నారు.

సిర్నాపూర్ కోటను సందర్శించిన విద్యార్థులు

మోపాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఉన్న నైజాం కాలంలో నిర్మించిన కోటను శనివారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సందర్శించారు. నిర్మించిన కోట కట్టడాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. నైజాం కాలంలో రాజులు ఈ కోటలో ఉండేవారని ఈ కోట విశేషాలను కట్టడాలను, సొరంగ మార్గాలను విద్యార్థులకు వివరించారు. ఆ కాలంలో రాజులు ఈ కోటలో ఉండేవారని విద్యార్థులకు తెలియజేశారు. వీరి వెంట ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు రాము, అనురాధ, విద్యార్థులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

● రూ. 6135 నగదు స్వాధీనం ● ఏడుగురు అరెస్ట్

రెంజల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి గ్రామంలో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సాయన్న సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 6135రూపాయలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎవరైనా పేకాట ఆడితే రెంజల్ పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని లావణ్య రాష్ట్రస్థాయి జూనియర్ ఖో ఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవీందర్ తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో లావణ్య పాల్గొంటుందన్నారు. ఎంపికైన విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ పాఠశాల విద్యార్థి..

ముప్కాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రంలో నిర్వహించి జిల్లాస్థాయి ఖోఖో పోటీల అండర్ -19 విభాగంలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని డి.అపర్ణను ఎంపిక చేశారు. బాల్కొండ మోడల్ స్కూల్‌లో ఇంటర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అపర్ణ ఈ నెల 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు మోడల్ స్కూల్ పీడీ ముత్తెన్న తెలిపారు. విద్యార్థిని లావణ్యను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

తొర్లికొండలో ఘనంగా వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి,, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్ నగర్ విద్యుత్ కార్యాలయం వద్ద ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 327యూనియన్ పతకాన్ని ఆవిష్కరించి యూనియన్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. గత 70 ఏళ్ల నుంచి కార్మికుల శ్రేయస్సు కోసం ఐఎన్‌టీయూసీ 327కార్మికుల పక్షాన పోరాడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ డివిజన్ అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.చందర్ నాయక్ పాల్గొన్నారు.

ఫోకస్

పల్లెలపై పట్టింపేదీ!?


ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- అడ్రస్ లేని స్పెషల్ ఆఫీసర్లు
- బాధ్యతగా కొందరు, భారంగా ఇంకొందరు
- గ్రామాల వైపు కన్నెత్తి చూడని పలువురు
- పారిశుధ్యం నీటి సరఫరా అస్తవ్యస్తం
- వ్యాధులు వ్యాపిస్తున్నా చర్యలు శూన్యమే..

ఎల్లారెడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడం ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు నిధుల కొరతతో కనీస మరమ్మతులు కూడా చేయించలేని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ ఖజానాలో నిధుల సమస్య వల్ల చెత్త సేకరించడానికి వినియోగించే ట్రాక్టర్లలో డీజిల్ నింపలేని దుస్థితి పలు చోట్ల నెలకొంది.

పల్లెల వైపు చూడని ప్రత్యేక అధికారులు

కామారెడ్డి జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల ఉన్నాయి. ఫిబ్రవరి నుంచి ఈ గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించారు. మండల డివిజన్ స్థాయి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తమ మాతృశాఖలతో పాటు ప్రత్యేక అధికారులుగా పల్లెలను సైతం పర్యవేక్షించాలని ఆదేశిలిచ్చారు. కానీ చాలా మంది ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదు. వారానికోసారి కూడా గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. కనీస అవసరాలకు సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిధుల కొరత కారణంగా గ్రామంలో తప్పనిసరిగా చేపట్టాల్సిన పనులకు పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు వేచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరు నెలలుగా ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ వారి ముద్ర కానరావడం లేదు.

రోగాల బారిన పడుతున్న ప్రజలు

గ్రామాల్లో అపరిశుభ్రత కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. అందుకు గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. మురికి కాలువలు, ఇళ్ల సమీపాల్లో చెత్తాచెదారం మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు ప్రబలుతున్నాయి. మురికి కాలువల్లో ఉన్న నీరు మళ్లించే ప్రయత్నాలు జరగడం లేదు. అదే విధంగా గ్రామాల్లో రక్షణ చర్యలు చేపట్టం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పలు గ్రామాల్లో అడ్డగోలుగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. కనీసం ప్రత్యేక అధికారులు పర్యవేక్షించేలా జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన రోగుల సంఖ్య

గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు, తాగునీటి సమస్య విపరీతంగా ఉండటంతో దానికి తోడు ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఒక్కో అధికారికి నాలుగు నుంచి ఐదు గ్రామాలు ప్రత్యేక అధికారి బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన నుంచి ఇప్పటి వరకు గ్రామాల వైపు కొందరు ప్రత్యేక అధికారులు చుట్టపు చూపులాగా వచ్చి వెళుతున్నారు. దీంతో పల్లెల్లో ఉండే ప్రజలకు పరిశుభ్రత లేకపోవడం వల్ల సీజనల్ వ్యాధులతో బాధపడుతూ ఉన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు రావడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు కరువు

సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో మురికి కాలువలు పారిశుధ్య లోపం, తాగునీటి సమస్యతో గ్రామీణ ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడానికి స్థోమత లేకపోవడం స్థానికంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించడం కరువైంది. ఒక పక్క ప్రత్యేక అధికారుల నిర్లక్ష్యం, మరో పక్క వైద్య సిబ్బంది, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించక పోవడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులతో పాటు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరుతున్నారు.

కళ్యాణి గ్రామంలో రోడ్డుపై నిలిచిన మురికి నీరు




మురికి కాలువలు శుభ్రం లేక నిండిన మురుగు నీరు


ప్రభుత్వ పాఠశాల వెనుక రోడ్డు పక్కనే చెత్త

ఏఈవోలకు పని ఒత్తిడి!

- ప్రభుత్వ నిబంధల ప్రకారం 5వేల ఎకరాల లోపు విస్తీర్ణం వరకే సర్వే
- దోమకొండలో ఇద్దరే ఏఈవోలు
- ఒక్కొక్కరికి 6,500 ఎకరాల విస్తీర్ణం కేటాయింపు




తుకం మడిని పరిశీలిస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి, ఏఈవో శ్రీలత(ఫైల్)

దోమకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సర్వే పని ఒత్తిడితో ఏఈవోలు సతమతమవుతున్నారు. ప్రభుత్వం క్లస్టర్ ప్రకారం.. ఏఈవోలను నియమించి రైతువేదికల్లో రైతులకు సేవలు అందించాలనే ఆలోచనతో ప్రణాళిక చేసింది. అన్ని బాగనే ఉన్నప్పటికీ ఏఈవోలకు పనిభారం ఎక్కువై ఒత్తిడికి లోనవుతున్నారు. దోమకొండ పరిధిలో మొత్తం 12,552 ఏకారాల సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో ఇద్దరు ఏఈవోలకు ఒకోక్కరికి 6వేల2వందల 76 ఎకరాలకు విధులు నిర్వహించవలసి వస్తోంది. కాగా, దోమకొండ మండలంలోని అంబార్‌పేట, దోమకొండ క్లస్టర్‌లో భాగంగా వర్షకాలం పంటల సాగు అదనంగా ఉందంటున్నారు. ఏఈవోలకు ప్రభుత్వ నిబంధనల కంటే 1200 పైగా విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో పంటల సర్వేల సమయంలో ఏఈవోలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామం	వరి	మక్క	పత్తి	మామిడి	బ్లాక్‌గ్రామ్	గ్రీన్‌గ్రామ్	రెడ్‌గ్రామ్	మొత్తం
అంబార్‌పేట	1937	0	1	15	0	0	0	1961
అంచనూర్	1364	5	380	9	19	0	5	1801
సంగమేశ్వర్	1417	1	0	46	0	0	0	1466
సీతారాంపల్లి	331	0	17	0	0	0	0	352
సీతారాంపూర్	975	0	6	5	0	0	0	992
చింతమాన్‌పల్లి	602	25	22	15	22	2	15	717
దోమకొండ	2269	18	67	124	54	17	25	2652
కుందారం	321	0	0	3	0	1	0	328
లింగుపల్లి	317	1	2	0	33	3	0	371
ముత్యంపేట	1723	29	9	84	6	2	19	1914
	11,260	80	507	305	135	25	65	12,552

ఫొటో న్యూస్




● నగరంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద ప్రమిదల షాపుల వద్ద కొనుగోళ్ల సందడి


● ఆసక్తిగా చూస్తున్న మహిళలు






లక్ష్మీగణపతి ప్రతిమలు





మార్కెట్లో దీపావళి సందడి

● ప్రమిదలకు పెరిగిన గిరాకీ!

మరో నాలుగు రోజుల్లో దీపావళి పండుగ ఉండటంతో ప్రమిదల గిరాకీ ఊపందుకుంది. పూలాంగ్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ప్రమిదల దుకాణాల వద్ద వినియోగదారుల సందడి పెరిగింది. గుజరాత్, ముంబాయి, కోల్‌కత్తా, బనారస్ నుంచి వచ్చిన వ్యాపారులు తమ వస్తువులను విక్రయిస్తున్నారు. గంగా, బనారస్‌లలో తయారైన మట్టి ప్రమిదలకు గిరాకీ ఎక్కువగా ఉంది. సుమారు పండుగకు పది రోజుల ముందే వీరు నగరంలో తాత్కాలిక గుడాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. మట్టి ప్రమిదలకు ఆకర్షణీయమైన రంగులు అద్ది వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. 10 రూపాయల నుంచి 200 రూపాయల వరకు ప్రమిదలను విక్రయిస్తున్నారు. లక్ష్మీదేవి, గణపతి, తదితర దేవతా మూర్తుల మట్టి విగ్రహాలను కూడా విక్రయిస్తున్నారు. వీటితో పాటు పూలకుండీలు, ప్లాస్టిక్ పువ్వులను దుకాణాల్లో అమ్ముతున్నారు.

(- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్)



● గుజరాత్ నుంచి వచ్చిన మట్టి ప్రమిదలు


● ముంబాయి నుంచి వచ్చిన ప్రమిదలు


● కోల్‌కత్తా నుంచి వచ్చిన ప్రమిదలు


● దొంతులు


● నెమలి అలంకరణలో పూలకుండీ


● ఏనుగు బొమ్మ

ఆంధ్రజ్యోతి పరిశీలన



పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువు!

- నిరుపయోగంగా నీటి ట్యాంకర్లు
- కోతుల ఆహారశాలలు కనుమరుగు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు


పొందుర్తి ప్రకృతివనంలో విరిగిపోయిన బెంచీ


ప్రకృతివనంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు ఇలా..

రాజంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల సర్పంచ్‌ల పదవీకాలం గత జనవరితో ముగియగా ప్రభుత్వం పంచాయతీ పాలనకు ప్రత్యేకాధికారులను కేటాయించింది. ప్రత్యేకాధికారులు పర్యవేక్షణకు వచ్చి కార్యాలయానికి పరిమితం అవుతుండడంతో పల్లెలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పట్టణాలు మాదిరిగానే పల్లెల్లో అహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతివనాలు, కోతుల ఆహారశాల ఏర్పాటు చేసిన దాని నిర్వహణ మాత్రం గాలికివదిలేశారు. కామారెడ్డి జిల్లాలో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ తీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

● కోతుల ఆహారశాలలు కనుమరుగు

రాజంపేట మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. పొందుర్తి గ్రామంలో గ్రామానికి కిలోమీటర్ అవతల జన సంచారంలేని భూమిలో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేశారు. వనంలో విరిగిన బెంచీలు, పిచ్చిమొక్కలు దర్శనం ఇస్తున్నాయి. ఇదేకాక ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతున్నాయి కనీసం పంచాయతీ అధికారులు అటువైపు చూసిన పాపానపోలేదు. గ్రామ పంచాయతీలలో ఉండాల్సిన అధికారులు మండల కార్యాలయంలో సమావేశాలు ఉన్నాయంటూ వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం దాటితే చాలాచోట్ల పంచాయతీ కార్యదర్శులు కనిపించడం లేదు. ప్రజలకు ఏదైనా అత్యవసరమయితే మరుసటి రోజు వరకు వేచిచూడాల్సి వస్తుంది. పల్లె ప్రకృతి వనాల్లో కోతుల ఆహారశాలలు ఉన్నాయా? లేవా? అనేది అర్థం కాని పరిస్థితి. ఎటుచూసిన పిచ్చిమొక్కలే కనికనిపిస్తున్నాయి. నిర్వహణ అధ్వానంగా మారింది. సిబ్బందితో వాటర్ ట్యాంకర్ల ద్వారా చెట్లకు నీరు అందించాల్సి ఉన్నా.. నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

● కనిపించని ప్రత్యేకాధికారులు

పల్లె ప్రకృతి వనాలతో పాటు ఇతర పనులను పరిశీలించాల్సిన ప్రత్యేకాధికారులు పల్లెలో కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అడపదడప కొన్నిచోట్లకు వస్తున్నా.. తిరిగి కార్యాలయానికే పరిమితమవుతున్నారు. దీంతో పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, సైడ్ కాలువల్లో పైపులైన్, సీసీ రోడ్లు, పారిశుధ్యం అధ్వానంగా మారింది. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి గెజిటెడ్ అధికారులను గ్రామాల ప్రత్యేక అధికారులుగా నియమించడంతో వారి శాఖలకు చెందిన పనుల్లోనే తలమునకలవుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

: రాజేశం, ఎంపీడీవో, రాజంపేట



మండలంలోని ప్రత్యేకాధికారులకు మూడు నుంచి నాలుగు గ్రామపంచాయతీలు కేటాయించారు. ప్రతిరోజు గ్రామపంచాయతీలలో పనులు పరిశీలిస్తు మండల స్థాయి పనులు చేస్తున్నారు. పొందుర్తి గ్రామంలో పల్లె ప్రకృతి వనానికి సరిపడేప్రభుత్వ భూమిలేనందున గ్రామస్తుల నిర్ణయం మేరకు ఎండోమెంట్‌ల్యాండ్‌లో ఏర్పాటుచేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు అత్యవసర సమయాల్లోతప్ప మిగిలిన సమయాల్లో గ్రామపంచాయతీలలోనే ఉండాలి. ఒకవేళ ప్రజలకు అందుబాటులో లేనట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటాం. పల్లెప్రకృతివనం,కోతుల ఆహారశాలల పర్యవేక్షణపై తక్షణ చర్యలు చేపడుతాం.

సీఎం రేవంత్‌ను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యే

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు శుక్రవారం రాత్రి సీఎం రేవంత్‌ను నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జుక్కల్ నియోజక వర్గంలోని సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌ను కలువగా సీఎం సమస్యల పరిష్కారం కోసం సానుకూలంగా స్పందించినట్లు కాంతారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో మొట్టమొదటి గా బిచ్కుంద మండల కేంద్రంలో ఐటీఐ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపానన్నారు. దీంతో పాటుగానే జుక్కల్ నియోజక వర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడంతో పాటు లెండి, నాగమడుగు ప్రాజెక్ట్ పనులు తొందరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు.

ముత్యాల పోచమ్మకు బోనాల సమర్పణ



వడ్లం గ్రామంలో బోనాలను ఊరేగింపు చేస్తున్న మహిళలు

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లం గ్రామంలో శనివారం ముత్యాల పోచమ్మ ఆలయంలో అమ్మవారి రెండో వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి రెండో వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థులందరూ ఉదయాన్నే ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తమ పిల్లాపాపలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని వేడుకుంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలోని ఆయా వీధుల గుండా మహిళలు బోనాలు తయారు చేసుకుని అంతా కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో ముత్యాల పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన గత సంవత్సరం చేశామని, ఈ సారి రెండేళ్లు కావడంతో అమ్మవారి ఉత్సవాలు చేశామని తెలిపారు.

పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప భక్తులకు సన్మానం



పాదయాత్రగా వెళుతున్న స్వాములను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మద్నూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండల కేంద్రం గుండా శబరిమల అయ్యప్ప సన్నిధానానికి వెళుతున్న పాదయాత్ర అయ్యప్పలకు మద్నూర్ సన్నిధానానికి వెళుతున్న పాదయాత్ర అయ్యప్పలకు మద్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి అయ్యప్ప స్వాములు ప్రతిఏడాది పాదయాత్రతో శబరిమల వెళుతుంటారు. వారు మద్నూర్ మండల కేంద్రానికి శనివారం రావడం జరిగింది. వారిని కాంగ్రెస్ నాయకులు హన్మాండ్లు స్వామి, రామ్ పటేల్, అమూల్‌లు అయ్యప్ప స్వాములకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గురుస్వామి హన్మాండ్లు మాట్లాడుతూ స్వామియే శరణమయ్యప్ప అయ్యప్ప స్వాములు పాదయాత్రతో డిసెంబర్ 12వ తేదీకి శబరిమల చేరుకుంటారని అడుగడుగునా వారికి భక్తులు సన్నిధానం ఏర్పాటు చేస్తారని గుర్తుచేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమడ్ల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గిల్బన్ వాలీబాల్, రంగశ్రీనిధి కబడ్డీ రాష్ట్రస్థాయి పోటిలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలీబాల్ పోటీలు ఈనెల 28, 29,30 తేదీల్లో గోదావరిఖని, పెద్దపల్లి జిల్లాలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు వచ్చేనెల 3,4,5వ తేదీల్లో నిర్వహిస్తారని తెలిపారు. అద్బుత ప్రదర్శనలు చేసి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భగత్, చక్రపాణి, దయాకర్, ఆంజనేయులు, నారాయణ, ప్రభాకర్, ఎస్.నారాయణ, వనిత, నర్సారెడ్డి, అనిత, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు విద్యార్థి..

మాచారెడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని ఉన్నత పాఠశాలకు చెందిన ప్రణీత అనే విద్యార్థిని ఖోఖో పోటీలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 17 నిజామాబాద్ జిల్లాలోని నందివాడ మండలంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ నెల 28 నుంచి 30 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎన్నికయిందన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి'

కామారెడ్డిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు పోచిరాం అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా కోర్టు తీర్పును అమలుచేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు.

'ఆలయాల జోలికి వస్తే చూస్తూ ఊరుకోం'



సమావేశంలో మాట్లాడుతున్న హిందూవాహిని రాష్ట్రసంఘటక్ యాదిరెడ్డి

కామారెడ్డిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని హిందూవాహిని తెలంగాణ రాష్ట్ర సంఘటక్ యాదిరెడ్డి అన్నారు. శనివారం ధర్మశాలలో హిందూవాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయాలపై దాడులను రాజకీయ కోణంలో చూడకూడదని, ఆలయాల ధ్వంసం చేసిన వారిని, వారి వెనుక ఉన్న శక్తులపై కూడా కఠినచర్యలు తీసుకోవాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ శ్రీరాముడు నడిచిన బాటలో నడవాలని అన్నారు. దేశ ప్రగతికి యువత నడుం బిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, నరేందర్, రాజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట, తాడ్వాయిలలో బంద్ విజయవంతం



నాగిరెడ్డిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

నాగిరెడ్డిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం తలపెట్టిన బంద్ విజయవంతమైంది. మండల కేంద్రంలో నరి వ్యాపారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వచ్ఛందంగా తమతమ దుకాణాలను, హోటళ్లను మూసి ఉంచి బంద్‌కు తమ మద్దతు తెలిపారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా జై శ్రీరాం నినాదాలతో మండల కేంద్రం హోరెత్తింది. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తే, హిందూ దేవాలయాల జోలికి వస్తే సహించేది లేదని హిందూ సంఘాల నా యకులు హెచ్చరించారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, స్థానిక ఎస్సై మల్లారెడ్డిలు పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు దేవిసింగ్, సంతోష్, గోపాల్, గంపల వెంకయ్య పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలో హిందూ సంఘాలు ఇచ్చిన బంద్ సంపూర్ణంగా జరిగింది. మండల కేంద్రంలోని వ్యాపార సంస్థలు, హోటళ్లు, కిరాణా దుకాణాలు, వస్త్ర దుకాణాలు ఇతర వ్యాపారస్తులు బంద్‌కు పూర్తి మద్దతు తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు.

పలు పోలీస్ స్టేషన్‌లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు



విద్యార్థులకు ఆయుధాల వినియోగంపై అవగాహన కల్గిస్తున్న ఏఎస్సై రాములు



మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్‌కు హాజరైన విద్యార్థులు

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై రాములు మాట్లాడుతూ విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో గల ఆయుధాల వినియోగంతో పాటు, పోలీసుల విధులు, సేవలు, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 వినియోగంపై అవగాహన కల్పించామన్నారు. దీంతో పాటు గానే సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు అన్న అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాయిశివ పాల్గొన్నారు.

మద్నూర్: మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ నిర్వహణ, రికార్డులు, ఆయుధాలు, పట్టుబడిన వాహనాలు, కేసుల వివరాలు, రిజిష్టర్ నిర్వహణ గురించి విద్యార్థులకు పోలీసులు వివరించారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మద్నూర్ గ్రామానికి చెందిన అమరవీరుడైన కుటుంబానికి బిచ్కుంద సీఐ నరేష్ పరామర్శించారు.

'సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి'

నాగిరెడ్డిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీస్ కళా బృందం సభ్యులు ప్రభాకర్, శేషారావులు కోరారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జిల్లా పోలీసు కళా బృందం ప్రోగ్రాం నిర్వహించారు. షీ టీమ్, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళల పట్ల విద్యార్థినుల పట్ల ఎల్లవేళలా షీ టీమ్ అందుబాటులో ఉంటుందని, ఎవరికి ఎలాంటి ప్రమాదం జరిగినా వెంటనే షీ టీమ్‌కు కాల్ చేసి న్యాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళా బృందం సభ్యులు ప్రభాకర్, శేషారావు, సాయిలు, పాఠశాల స్పెషల్ అధికారిణి గీత, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

'స్టాంప్ పేపర్లు ఇష్టారాజ్యంగా అమ్మితే చర్యలు'

కామారెడ్డిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్టాంప్ పేపర్లు ఇష్టారీతిన అమ్మడానికి వీలు లేదని ఉమ్మడి నిజామాబాద్, మెదక్ డీఐజీ (డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్) రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రికార్డులు తనిఖీ చేసి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సబ్ రిజిస్ట్రార్ కృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం ప్రజలు తప్ప దళారులు, డాక్యుమెంట్ రైటర్‌లు రావద్దని ప్రజలు సైతం రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన తెచ్చుకోవాలని తెలిపారు. అలాగే స్టాంప్ పేపర్ల అమ్మకాలకు సంబంధించి కేవలం ముగ్గురికి మాత్రమే అనుమతులు ఉన్నాయని ఇష్టారీతిన అమ్మకాలు జరుపుతున్నారని మా దృష్టికి వచ్చిందని ఆ విధమైన చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర బీజేపీ నాయకుడు పైడి ఎల్లారెడ్డి

నాగిరెడ్డిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర బీజేపీ నాయకులు, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి పరామర్శించారు. బొల్లారం గ్రామానికి చెందిన యువ రైతు మంద వెంకటేష్ పిడుగు పాటుకు గురై మృతి చెందడంతో పరామర్శించారు. గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి పోసన్నగారి కృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. వాడి గ్రామానికి చెందిన కొడే బీరయ్య, మాసానిపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, మెల్లకుంట తండాకు చెందిన అంగోత్ సువాలి బాయి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

'క్యాన్సర్‌ను దరిచేరకుండా అరికట్టడమే ఏకైక మార్గం'

సదాశివనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారిని దరిదాపుల్లోకి రాకుండా అరికట్టడమే ఉత్తమమైన మార్గమని వైద్యాధికారిణి ఆస్మా తెలిపారు. శనివారం సదాశివనగర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ఎవరికైనా క్యాన్సర్ రావడం అనేది ఆశ్చర్యకరమైన విషయమన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని, రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన వస్తువుల వాడకం బాగా తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నర్సారెడ్డి, కార్యదర్శి కమలాకర్‌రావు, కోశాధికారి శ్రీనివాస్, రాములు, గంగారెడ్డి, హెచ్‌ఎం రాజిరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



మృతిచెందిన మల్లయ్య

భిక్కనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మల్లయ్య(53) అప్పుల బాధతో ఈ నెల 17న గుర్తుతెలియని క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండ గొర్రెను వేటాడిన వ్యక్తిపై కేసు

గాంధారి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌గడ్డ తండాలో కొండగొర్రెను వేటాడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌ఓ హేమనందన తెలిపారు. రెండురోజుల క్రితం కొండగొర్రె మాంసాన్ని ముదెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించారని సమాచారం రావడంతో పట్టుకొని నిందితులపై కేసు నమోదు చేశారు.

వేధింపులపై కేసు నమోదు చేసిన పోలీసులు

ఎల్లారెడ్డి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ఎర్రమన్నుకుచ్చలో ఉండే శ్యామల అనే మహిళ భర్త నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్ని రోజుల నుంచి తన అత్తమామలు అయిన శారద మోహనచారితో పాటు ఆడపడుచు అయిన కళ్యాణి ఆడపడుచు భర్త రాజేష్‌కు వరుసకు చిన్న అత్త, మామలైన సుమంగళ భీష్మాచార్యులు అందరూ కలిసి శ్యామలను ఎల్లారెడ్డి నుంచి వెళ్లిపోయి ఎక్కడైనా బతకమని కొన్ని రోజుల నుంచి వేధిస్తూ ఆమెను తిట్టి కొడుతున్నారని ఈ విషయమై పలుమార్లు ఇరువురు పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడిన వినకపోవడంతో శనివారం శ్యామల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నాటు తుపాకి వినియోగిస్తున్న వ్యక్తి అరెస్టు

ఎల్లారెడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుట్లపేట గ్రామానికి చెందిన రాణా ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి నాటు తుపాకి వాడుతున్నాడనే సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు సోదా చేశారు. నాటు తుపాకిని స్వాధీన పరచుకుని స్థానిక ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి రాణాప్రతాప్‌సింగ్ విచారించి శనివారం బాన్సువాడ కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారని ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్స్ అందజేత

ఎల్లారెడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ సీఈఆర్ విధానం ద్వారా గుర్తించి వాటిని శనివారం ఫిర్యాదు దారులను పిలిపించి అప్పగించినట్లు ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన వాజీద్ ఖాన్, ఖలిమొద్దీన్, ఉప్పరి సాయులు ఫోన్లు పోగొట్టుకున్నారని వీరి ఫోన్లు సీఈఐఆర్ ద్వారా గుర్తించామన్నారు. వీరిలో వాజీద్ ఫోన్ ఏడాది క్రితం పోయిన సీఈఐఆర్ పట్టేసిందన్నారు.

జోరుగా లింగ నిర్ధారణ దందా

(5వ పేజీ తరువాయి)

విషయంలోనూ గత నాలుగు నెలల క్రితం లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడబిడ్డ అని తేలగానే పుట్టిన తర్వాత ఆ పసికందును అమ్మిన వ్యవహారంలోనూ కేసు నమోదవడంతో పాటు ఆ ఆసుపత్రిని సీజ్ చేశారు. అదేవిధంగా మహారాష్ట్రలోని ఓ ప్రాంతానికి చెందిన గర్భిణికి లింగ నిర్ధారణ చేసి ఆడపిల్ల అని కామారెడ్డిలోని ఓ ఆసుపత్రి నిర్వాహకులు చెప్పడంతో అక్కడి పోలీసులు సదరు వైద్యుడిపై కేసు నమోదు చేశారు. అయితే వీరంతా ఒక ముఠాగా ఏర్పడి ఈ దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లాలోనే కాకుండా చుట్టుపక్కల జిల్లాలైన సిద్దిపేట, నిజామాబాద్, సిరిసిల్ల, మెదక్‌లోనూ వీరు మొబైల్ వాహనాల ద్వారా మినీ స్కానింగ్ యంత్రాలను తీసుకెళ్లి గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో గర్భిణీకి లింగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. అయితే పొరుగు రాష్ట్రాల్లోను వీరి దందాను విస్తరించారు. ఈ ముఠా కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఓ ఆసుపత్రిని కేంద్రం చేసుకుని ఈ దందాను నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రైవేట్ ఆసుపత్రుల్లో, స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ ఆపరేటింగ్ చేసిన వారిని ఈ ముఠా మచ్చిక చేసుకుని ఇతర గ్రామాల్లో వీరి చేత లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ముఠాపై వైద్య ఆరోగ్య, పోలీసు శాఖలు మరింత నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని సబ్దల్‌పూర్ గ్రామానికి చెందిన ఇతర పార్టీలకు చెందిన సుమారు 20 మంది నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామస్తులు గ్రామ రెవెన్యూ సమస్యను ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, రెవెన్యూ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు అదేవిధంగా రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి సంపూర్ణంగా మద్దతు తెలుపుతామని కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రజితా వెంకట్రామిరెడ్డి, నాయకులు సామెల్, బొండ్ల సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, సందీప్, బయ్యని సాయిలు, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

వార్డులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణంలోని 8,9,10 వార్డుల పరిధిలో నూతన సీసీ రోడ్ల నిర్మానానికి శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ శ్రీకాంత్ రోడ్లను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు వార్డులలో సీసీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వినోద్, కాంగ్రెస్ నాయకులు ననుగొండ శ్రీనివాస్, గాదె తిరుపతి, అల్లం శ్రీనివాస్, కౌన్సిలర్ నీలకంఠం, సుభాష్ అప్ప, సంగని పోచయ్య తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలును వెంటనే ప్రారంభించాలి

భిక్కనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు కోతలు ప్రారంభించి దాదాపుగా నెలరోజులు గడుస్తున్నా రైతుల వద్ద నుంచి ధాన్యం ఎందుకు కొనుగోలు చేయడం లేదని భిక్కనూరు మండల బీఆర్‌ఎస్ నాయకులు శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం అలంకార ప్రాయంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని, ప్రారంభించిన కేంద్రాల్లో ఎందుకు ధాన్యం కొనుగోలు చేయ్యడం లేదని ప్రశ్నించారు. తక్షణమే దాన్యాన్ని కొనుగోలు చేయాలని లేనియెడల పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, భూంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్, మాజీ వైస్‌ఎంపీపీ యాదగిరి, నాయకులు సాయిరెడ్డి, నర్సారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

సీహెచ్‌సీని తనిఖీ చేసిన వైద్య విధాన పరిషత్ కమిషనర్

దోమకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ తనిఖీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని, పేషెంట్ల దగ్గరికి వెళ్లి పరామర్శించారు. రెండు రోజుల తనిఖీలో భాగంగా దోమకొండ ఆసుపత్రిని సందర్శించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, వైద్యులు విజయలక్ష్మీ, వైద్వవి, శ్రీవాణి దివ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీర్కూర్‌లో మండల సమాఖ్య సమావేశం

బీర్కూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం గంగాధర్ మాట్లాడుతూ మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేసి వివిధ రకాల వ్యాపారాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, నాగమణి, మహేందర్, పండరి, దశరథ్, నారాయణ, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌పై సత్వరమే విచారణ చేపట్టాలి

- కామారెడ్డి ప్రజాస్వామిక వాదుల డిమాండ్

కామారెడ్డిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ఆర్టీసీ డిపో పరిధిలో డ్రైవర్లను, కండక్టర్లను ఇతర సిబ్బందిని వేధింపులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లపై సత్వరమే విచారణ జరిపించాలని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌కు కామారెడ్డి ప్రజాస్వామిక వాదులు, న్యాయవాదులు జగన్నాథం, సిద్దిరాములు, నరసింహారెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులను వేధించడం, వారి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని గతంలోనే తాము ఆధారాలతో పాటు బయటపెట్టినప్పటికి సంస్థ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి డిపో మేనేజర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వ్యవసాయంతో పాటు కోళ్ల పెంపకం లాభదాయకం

- డీపీఎం వకుళ



ఆర్గొండలో పెరటికోళ్ల యూనిట్‌ను పరిశీలిస్తున్న డీపీఎం వకుళ

రాజంపేట, అక్టోబరు 26: రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామంలో శనివారం పెరటికోళ్ల మదర్ యూనిట్ డీపీఎం వకుళ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి చెందిన తుల మమత భర్త చంద్రం, తుల భూలక్ష్మీ పెరటి కోళ్లమదర్ యూనిట్ పెంపకాన్ని పెంచడం జరుగుతుందని తెలిపారు. తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కోళ్ల పెంపకం లబ్ధిదారులు మమత మాట్లాడుతూ 45 రోజుల కోడి పిల్లలను తీసుకురావడం జరిగిందని ప్రస్తుతం 62 గ్రామ్స్ వరకు ఉన్నాయని 110 రూపాయలకు ఒకటి కొనుగోలు చేయడం జరిగిందని ఇప్పుడు 250 వరకు అడుగుతున్నారని దాదాపు 700 నుండి 800 గ్రామ్స్ ఉంటుందని తెలిపారు. వీటి ధర రూ.500 నుంచి 600ల వరకు ఉంటుందని అంచనా వేయడం జరిగిందన్నారు. ఇది మాకు లాభదాయకంగానే ఉంది. వ్యవసాయంతో పాటు కోళ్లను పెంచడం జరుగుతుందని తెలిపారు. కోళ్లను పెంచడం మాకు చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజేందర్, ఏటీఎం సాయిలు, సీసీసాయిలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- దేవర
దర్శన్	- ద లాస్ట్ డ్యాన్స్ పాట్టేల్
ప్రియా 35	- విశ్వం
ప్రియా 70	- లగ్గం

బాన్సువాడ

మహేశ్వరి	- వేట్టయన్ (ది హంటర్)
వెంకటేశ్వర	- విశ్వం

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190